# అలలు విరిగే చోటు

"అర్చన వచ్చేది రేపే!" అనుకుంది భవాని ఉద్వేగంతో.
ఆరోజు నిద్రలేవాక ఆమె అలా అనుకోవడం అది అరవయ్యోసారి.
రెండేళ్ళ తర్వాత ప్రాణస్నేహితురాల్ని చూస్తున్నానన్న నిజం ఆమెని స్థిమితంగా నిలవనివ్వడం లేదు.
ప్రాణస్నేహం. అవును. తమ మధ్యనున్న స్నేహాన్ని వాళ్ళిద్దరూ అలాగే భావిస్తారు. తాము కాలేజ్ లో కలుసుకున్న మొదటిరోజు. . వాళ్ళిద్దరికీ యిప్పటికీ చాలా అపురూపమయిన రోజు.
మూడేళ్ళ కాలేజ్ జీవితం. . హాస్టల్. కలిసి చూసిన సినిమాలు. . చదివిన పుస్తకాలు. . ప్రతి సంఘటనా వాళ్ళ స్నేహాన్ని పెంచేందుకే తోడ్పడ్డాయి.
ఎపుడయినా. . ఏ పరిస్థితికైనా యిద్దరూ ఒకేలా స్పందించేవారు.
సరదాకి పోట్లాడుకుందామన్నా వాళ్ళిద్దరికీ ఏ విషయంలోనూ భిన్నాభిప్రాయం వుండేది కాదు.
"మీ జీవితంలో ఎదురయిన అద్భుతం ఏమిటి?" అని భవానిని ఎవరైనా అడిగితే బహుశా ఒకటే సమాధానం చెప్తుంది. "సరిగ్గా నాలాగే ఆలోచించే స్నేహితురాలు వుండడం. " అని.
డిగ్రీ ఎగ్జామ్స్ వ్రాయడం ఆలస్యం అర్చన పెళ్ళయ్యింది. అతను యింజనీర్. పెళ్ళినాటికి అమెరికాలో వున్నాడు. అతను పనిచేసే కంపెనీ తరుపున ఏదో ట్రైనింగ్ కి వెళ్ళాడు.
తనుకూడా అమెరికా వెళ్తూ భవానిని హెచ్చరించింది అర్చన. "అమ్మావాళ్ళు ఏ సంబంధం తెస్తే దానికల్లా తలూపకు. ఏ క్లర్క్ నో, టీచర్నో చేసుకున్నావంటే లైఫ్ నరకమయిపోతుంది." అని.
భవాని గతుక్కుమంది.
ఎందుకంటే అంతకుముందురోజే ఎవరో ఒక సంబంధం చెప్పారు. అతను సెక్రటేరియట్ లో యు. డి. సి. ఆ సంబంధం కుదిరితే బాగుండునని తల్లీ తండ్రీ ఆశ పడుతున్నారు.
ఏం మాట్లాడాలో తెలీక ఓ క్షణం తడబడి "నాదేముంది!" అంది భవాని నవ్వుతూ.

అలా అమెరికా వెళ్ళిపోయిన అర్చన సంవత్సరం తర్వాత తిరిగొచ్చింది. భర్తకి మద్రాస్ లో వుద్యోగం. అత్తగారు.. మామగారు.. పెద్ద యిల్లు.. ఆ వాతావరణం అంతా వివరంగా ఉత్తరం వ్రాసింది.

దానికి భవాని బదులు వ్రాసింది. తన పెళ్ళి దాదాపుగా ఖాయమయిందనీ.. వరుడిపేరు ప్రకాశ్ అనీ.. పెళ్ళి నెలరోజుల్లో వుండవచ్చనీ.. అర్చన తప్పక రావాలనీ.

ప్రకాశ్ వుద్యోగం సంగతి మాత్రం వ్రాయలేదు. అతను ఒక గవర్నమెంటాఫీసులో టైపిస్ట్. ఆమాట వ్రాసేందుకు ధైర్యం చాలలేదు భవానికి.

అర్చన పెళ్ళికి వచ్చింది. ప్రకాశ్ స్థితిగతుల గురించి ప్రత్యేకించి భవానిని అడగలేదు. అయినా అంతా అర్థమయ్యే వుండవచ్చుననుకుంది భవాని.

ప్రొద్దున పదింటికి పెళ్ళయితే రాత్రి పదిగంటలకి భవాని అత్తవారింటికి ప్రయాణమయింది. ఆవెంటనే అర్చన మద్రాస్ బస్ ఎక్కింది.

మళ్ళీ యిప్పుడు.. రెండున్నరేళ్ళ తర్వాత.. అర్చన హైదరాబాద్ వస్తున్నానని ఉత్తరం వ్రాసింది. ఈలోపులో భవాని జీవితంలో చాలా మార్పులొచ్చాయి. ఒక బాబు పుట్టాడు. తనుకూడా ఓ చిన్న స్కూల్లో టీచర్ గా జాయినయింది.

రోజూ ప్రొద్దున్నే హడావుడిగా బయల్దేరి, బాబుని రెడీచేసి బేబీకేర్ సెంటర్ లో అప్పచెప్పి.. బస్ ఎక్కి స్కూల్ కి వెళ్ళాలి. సాయంత్రం స్కూల్ అయిపోగానే మళ్ళీ బాబుని తీస్కుని యింటికి వచ్చి, వాడి పనులు చూసి, యింటి పనీ వంట పనీ చేసుకోవాలి. మధ్యలో ఒక పదిమంది పిల్లలకి ట్యూషన్ చెప్పాలి.

దాదాపు ఒక యంత్రం లాగే అయిపోయింది భవాని పని. ఈ విసుగు నిండిన జీవితంలోకి రెండ్రోజుల పాటు మార్పు వస్తుందన్న ఆలోచనే ఆమెకి అంతులేని ఉత్సాహాన్నిస్తోంది.

స్నానానికి వెళ్తూ బీరువాలోనుంచి చీర తీసుకుంటూంటే అర్చన లెటర్ కనిపించింది. అంత హడావుడిలోనూ మరోసారి మడతవిప్పి దాన్ని చదవకుండా వుండలేకపోయింది భవాని.

"..ఆదివారం ప్రొద్దున మామరిది పెళ్ళి హైదరాబాద్ లో. నేను శుక్రవారం రాత్రి బయల్దేరి వస్తాను. శనివారం అంతా నీతో వుంటాను. ఆదివారం పెళ్ళింట్లో కూడా మనకేమీ పనుండదు. రెండ్రోజులూ మనం బోలెడన్ని కబుర్లు చెప్పుకోవచ్చు. ..నీతో ఎన్నెన్ని విషయాలో మాట్లాడాలి. .. ఎపుడెపుడు చూస్తానా అనిపిస్తోంది..."

కుక్కర్ మోతతో పులిక్కిపడి ఉత్తరం లోపల పెట్టి బీరువా మూసేసింది భవాని. సెకన్ల ముల్లుతో పాటూ పరుగెత్తుతూ.. ఇరవై నిమిషాల్లో బాబునెత్తుకుని బయటకి వచ్చింది. ప్రకాశ్ అపుడే నిద్రలేచి పేపర్ చదువుకుంటున్నాడు. "ఏవండీ! నేవెళ్తున్నా!" అలవాటుగా ఆ రెండు మాటలూ చెప్పి రోడ్డు మీదికి నడిచింది భవాని.

బాబుని వదిలేసి బస్ స్టాప్ కి వెళ్ళడం ఆలస్యం.. బస్ వచ్చింది. "అమ్మో! ఇంకొక్క క్షణం ఆలస్యం అయి వుంటే మిస్ అయిపోయేదే!.." అనుకుంది.

నెమ్మదిగా వెళ్ళి సీట్లో కూర్చుంటూంటే "బావున్నారా!" అంది కిటికీ దగ్గర కూర్చున్న ఆమె.

భవాని తలెత్తి చూసి పలకరింపుగా నవ్వింది. "మీరా!" అంటూ. ఆమె పేరు లక్ష్మి. భవాని లాగే ఏదో చిన్న స్కూల్లో ఉద్యోగం.

బస్ లోనే పరిచయం అయింది.

"ఏంటి! మీరసలు కనపడటంలేదు." అంది భవాని ఆశ్చర్యంగా.

"మా అత్తగారికి బాగాలేదంటే వూరికెళ్ళాం. ఇవాళ ప్రొద్దునే వూర్నుంచి వచ్చాను."

"ఓహో!." అంది భవాని. "ఏమయింది!"

"ఏం లేదు. మామూలు సుస్తీనే. అక్కడ చేసేవాళ్ళెవరూ లేరు. అందుకని నేను వెళ్ళవలసి వచ్చింది." నిట్టూరుపుతో కూడిన నవ్వుతో చెప్పిందామె. "నాలుగురోజుల సెలవులు పోయాయి. పోయిన శనివారం సాయంత్రం వెళ్ళాను. మళ్ళీ యివాళ శుక్రవారం."

భవాని చిన్నగా నవ్వింది. "నేను కూడా రేపు సెలవు పెడుతున్నాను. మాఫ్రెండ్ వస్తోంది." అంది వెలుగుతున్న మొహంతో.

వీలయితే ఆ బస్ పైకెక్కి "రేప్రొద్దున మాఫ్రెండ్ వస్తోందీ.." అని అరవాలన్నంత ఉత్సాహంగా వుంది భవానికి.

సాయంత్రం వరకూ అదే ఉత్సాహంతో గడిపింది. ఇంటికి రాగానే యిల్లంతా చిమ్మి తడిగుడ్డతో తుడిచింది. మర్నాడు ప్రొద్దున టిఫిన్ కోసం పప్పు నానబోసింది. వంట మాత్రం సింపుల్ గా చారుతో ముగించేసింది, మర్నాటికి చద్ది వంటలేమీ మిగలకుండా. ప్రొద్దుటి వంట కోసం కూరలు తరిగి పెట్టుకుంది. వీలయినంత పని రాత్రికే చేసేసుకుంటే అర్చన వచ్చాక కదలకుండా కబుర్లు చెప్పుకోవచ్చునన్న ఆలోచన.

"రేపు నేను సెలవు పెట్టనా!" అన్నాడు ప్రకాశ్ పడుకోబోతూ.
"ఎందుకు!" అంది భవాని నవ్వుతూ. "రేపొక్కరోజా మీరు ఎంత త్వరగా బయటకి వెళ్తే అంత సంతోషం నాకు."
మొహం ముడుచుకున్నాడు ప్రకాశ్. "పెద్ద గొప్ప. నీకొక్కదానికే వుంది ఫ్రెండ్." అన్నాడు. "చూడు. రేప్రొద్దున అయిదింటికే యింట్లోంచి వెళ్ళిపోయి రాత్రి పన్నెండు దాకా రాను."
గలగలా నవ్వింది భవాని. అతని ప్రక్కనే మేను వాలుస్తూ "అలా ఎలా! అంత ప్రొద్దున్నే వెళ్ళిపోతే అర్చనని స్టేషన్నుంచి యింటికెవరు తెస్తారు! దాన్ని తీసుకొచ్చి యింట్లో దింపి తర్వాత వెళ్ళిపోండి." అంది.
ఆమె తలమీద చిన్న మొట్టికాయ వేసి దగ్గరికి తీసుకుంటూ "ఆ డ్యూటీ మాత్రం తప్పదన్నమాట నాకు." అన్నాడతను.
ప్రక్క మీద ఓ నాలుగు గంటలు మెసిలిందేమో! అంతే. అయిదు కాకముందే మళ్ళీ లేచి కూర్చుంది భవాని.
ఆ చీకట్లోనే వాకిట్లో ముగ్గులేసింది. పప్పు రుబ్బేసింది. కాఫీకి డికాషన్ తీసింది. ఆరవుతూండగా ప్రకాశ్ ని లేపి స్టేషన్ కి పంపింది. అతను వచ్చేసరికి యిల్లంతా మరోసారి సర్ది, స్నానం చేసి వంట మొదలు పెట్టింది.
కూర.. పప్పు.. పచ్చడి.. పులిహోర.. స్వీటు.. వంట అయిపోవస్తున్నా రావలసిన వాళ్ళ జాడ లేదు.
"ఇంకా రాలేదేమిటా!" అని భవాని ఆశ్చర్య పోతూండగా వినిపించింది వాకిట్లో స్కూటర్ శబ్దం.
ఆత్రంగా బయటకి పరుగెత్తుకు వచ్చిన ఆమె స్కూటర్ మీద నుంచి ప్రకాశ్ ఒక్కడే దిగడం చూసి ఆశ్చర్యపోయింది. "ఏమిటండీ! అర్చనేదీ! రాలేదా!" అంది.
ప్రకాశ్ నెమ్మదిగా యింట్లోకి వచ్చాడు. కుర్చీలో కూర్చుంటూ యింకా మెల్లగా చెప్పాడు. "వచ్చింది. వాళ్ళ అత్తగారూ వాళ్ళందరూ కూడా వచ్చారు. అందరూ కలిసి విడిదింటికి వెళ్ళిపోయారు. నిన్నే అక్కడికి రమ్మంది. అడ్రస్ యిచ్చింది."
నిస్సత్తువగా కుర్చీలో కూర్చుంది భవాని. " అయితే యిపుడిక్కడికి రాదా!" అంది ఏడుపు ధ్వనించే గొంతుతో.

ప్రకాశ్ లేచి లోపలి గదిలోకి వెళ్తూ "వంటయిందా! కాళ్ళు కడుక్కుని వస్తాను. అన్నం పెట్టు." అన్నాడు.

నిమిషం తర్వాత తేరుకుంది భవాని. ప్రకాశ్ కి అన్నం పెట్టింది. తనుకూడా ఏదో తిన్నాననిపించి బాబుని తీసుకుని ప్రయాణమయింది.

ఆమెని అర్చన దగ్గర దింపి తను ఆఫీస్ కి వెళ్ళాడు ప్రకాశ్. ఎవరితోనో కబుర్లు చెపుతూన్న అర్చన పరుగెత్తుకుంటూ వచ్చి భవానిని కౌగలించుకుంది.

"ఇంటికి వస్తావనుకున్నాను." అంది భవాని నిష్ఠూరంగా.

"ఎక్కడే! పెళ్లికని వచ్చి మధ్యలో నేనటు వస్తే ఏం బాగుంటుంది చెప్పు! అయినా యిక్కడే హాయిగా కబుర్లు చెప్పుకోవచ్చు మనం." అంది అర్చన చాలా తేలిగ్గా.

"ఇక్కడా! ఇక్కడ కబుర్లు చెప్పుకోవాలా!" అనుకుంది భవాని నిస్సహాయంగా. ఆ క్రొత్తవాళ్ళ మధ్య ఆమెకసలు ఊపిరి ఆడనట్లు అనిపించింది.

అయినా ఎలాగో ఓ మూల చూసుకుని కూర్చున్నారిద్దరూ. "ఊ. చెప్పు." అంది అర్చన.

ఏం చెప్పాలి! భవానికసలు గొంతే పెగలలేదు.

"నువ్వే చెప్పు." అంది. "మీవారు బాగున్నారా!"

"ఆయనకేం! బాగానే వున్నారు." అంది అర్చన ఆసక్తి ధ్వనించని స్వరంతో.

తర్వాత ఏం మాట్లాడాలో భవానికి అర్థం కాలేదు.

ఒక్కొక్క చేతికీ అరడజను బంగారు గాజులు.. మెడనిండా నగలతో అర్చన మెరిసిపోతోంది. "ఇపుడే యిలా వుంటే ముహూర్తం టైముకి యింకెన్ని నగలు పెట్టుకుంటుందో!" అనుకుంది భవాని ఆశ్చర్యంగా.

అయిదునిమిషాలు మౌనంగా గడిచాయి. భవానికి హటాత్తుగా గుర్తొచ్చింది. రెండు నెలల క్రితం తమ అభిమాన రచయిత్రి వ్రాసిన క్రొత్త నవల మార్కెట్లోకి వచ్చిందన్న విషయం.

ఎంత తీరిక లేని స్థితి అయినా దాన్ని సంపాదించి చదివే వరకూ నిద్ర పట్టలేదు భవానికి.

"అర్చన చదివిందో లేదో!" ఆమాట అనుకోవడమే తడవు పైకి అడిగేసింది భవాని.

"ఆ. లేదు." అంది అర్చన ఆవులిస్తూ. "పుస్తకాలు చదవడం మానేసి చాలా రోజులయింది."

మరేం చేస్తున్నావు! అని అడగలేక పోయింది భవాని. అడిగితే అర్చన చెప్పే సమాధానాలు తనకి అర్ధమవుతాయో లేదో అనిపించింది.

అవును మరి! డబ్బు గల వాళ్ళ హాబీలు ఏమిటో వినగానే తనకేం అర్ధమవుతాయి! వాటి గురించి తనేం మాట్లాడుతుంది!

సినిమాలేం చూశావు! అనే మాట నాలిక చివరివరకూ వస్తే బలవంతాన ఆపుకుంది.

అర్చనకి సంబంధించినంతవరకూ అంతకన్నా చచ్చు ప్రశ్న వుండదని భవానికి ఆపాటికి అర్ధమయింది.

మరింకేం అడగాలి! తన స్థాయి స్నేహితులెవరయినా కనబడితే తను అడిగే ప్రశ్నలన్నీ గబగబా భవాని మనసులో మెదిలాయి. క్రొత్తగా ఏం సామాన్లు కొన్నారు! వగైరా.

. . వగైరా. . .

ఊహు. అవేవీ అర్చనని అడిగే ప్రశ్నలు కావు.

భర్తా. . పిల్లలూ!

భర్త ప్రసక్తి యిందాకే అనాసక్తిగా కట్ చేసింది.

మూడేళ్లయినా యింకా పిల్లలు లేరే! అని అడగాలనిపించింది.

కానీ ధైర్యం చాలలేదు. "ఛీ. నాకు భయమేమిటి! అది నా ప్రాణస్నేహితురాలు. నాకా మాత్రం చనువు లేదూ!" అనుకుని నోరు తెరవబోతూండగా. .

"హాయ్ అర్చనా!" అంటూ ఎవరో అమ్మాయి వచ్చింది. నగల విషయంలో, నాజూకు విషయంలో అర్చనకి ఏమాత్రం తీసిపోవడం లేదు ఆఅమ్మాయి.

"మావారి బాబాయి కూతురు సుస్మిత. నా ప్రాణస్నేహితురాలు భవాని." హుషారుగా ఒకరికొకర్ని పరిచయం చేసింది అర్చన.

అర్చన గొంతులోని ఉత్సాహాన్ని భవాని ఆశ్చర్యంగా గమనించింది. చాలాసేపటి తర్వాత అర్చన గొంతు ఆ సౌండ్ తో వినిపిస్తోంది. ఇప్పటివరకూ చాలా మెల్లగా నిరాసక్తంగా మాట్లాడుతూంటే. . ప్రయాణపు బడలికేమో అనుకుంది భవాని.

కానీ. . మరిపుడు. . !

వాళ్లిద్దరూ ఏవో కబుర్లు చెప్పుకుంటుంటే భవాని కొంచెంసేపు యిబ్బందిగా కూర్చుంది. వడిలో బాబుని జో కొడుతూ పరిసరాలు గమనించసాగింది.

ఎత్తుగా వున్న కడుపుతో, చామనచాయగా వున్న శరీరంతో అటూ యిటూ తిరుగుతోంది ఓ పిల్ల. బహుశా పనిపిల్లేమో! అని భవాని అనుకుంటూండగానే అర్చన "ఎవరా పిల్ల! మీయింట్లో పనిచేసే శాంత కదూ!" అనడం వినిపించింది.

"అవును" అంది సుస్మిత.

"నేనసలు గుర్తు పట్టలేదు సుమా! పెళ్ళయ్యిందా!" అంది అర్చన ఆశ్చర్యంగా.

"ఆ. మమ్మీనే చేసింది. ఇపుడు కడుపుతో వుంది. అయిదో నెల."

"ఎన్నాళ్ళయింది పెళ్ళయ్యి!"

"తొమ్మిది నెలలయినట్లుంది."

ఫక్కున నవ్వింది అర్చన. "అసలు వీళ్ళకిక వేరే పనుండదా!" అంది నవ్వుతో కలగలిసిన గొంతుతో.

ఆ వ్యాఖ్యలో నిజానికి దురుద్దేశ్యమేమీ లేదు. ఆశ్చర్యం లేదు. ఎగతాళీ లేదు. చాలా తేలికగా అనేసిందంతే. ఆ క్షణం తన మనసులో అనిపించిన మాటని అలాగే పైకి అనేసింది. మాటని ఆచితూచి మాట్లాడాల్సిన మధ్య తరగతి స్థితిలో తను లేదు కనుక టకీమని అనేసింది.

కానీ భవానికి మాత్రం ఆ మాటతో తన యిబ్బంది పరాకాష్ఠని చేరుకున్నట్లు అనిపించింది. తన ఏడాది బాబుని అప్రయత్నంగా గుండెలకి హత్తుకుంది. ఆమె బాధని అర్థం చేసుకున్న నిజమయిన భర్తలా ప్రకాశ్ తలుపు దగ్గర ప్రత్యక్షమయ్యాడు.

భవాని ఒక్క ఉదుటున లేచి నిల్చుంది. "ఆయనొచ్చారు. వెళ్తాను."

అర్చన ఆశ్చర్యంగా చూసింది. "అదేంటి! రాత్రికి యిక్కడ వుండవూ!"

"ఇక్కడెలా వుంటాను!" అంది భవాని అదోరకంగా నవ్వుతూ. అప్రయత్నంగానే ఆమె గొంతులోకి కొద్దిగా నిష్ఠూరం వచ్చింది.

"ఏంటే! అసలు మాట్లాడుకున్నట్లే లేదు." అంది అర్చన.

ఆమె గొంతులో స్పష్టంగా వినిపించిన దిగులుకి భవాని మనసు మళ్ళీ కరిగింది.

"ప్రొద్దున్నే వస్తాలే!" అంది.

"త్వరగా వచ్చేయండి. తొమ్మిదింటికే ముహూర్తం." అంది అర్చన భార్యాభర్తలిద్దరి వైపూ చూస్తూ.

సరేనంటూ వచ్చిందే కానీ మర్నాడు ప్రొద్దున పెళ్ళికి వెళ్ళాలంటే బెరుకుగా అనిపించింది భవానికి.

పెళ్ళికి ఏం చీర కట్టుకోవాలి అన్న విషయానికి అంతకుముందురోజు వరకూ ఆమె యింపార్టెన్స్ యివ్వలేదు.

కానీ ఆరోజు అది పెద్ద సమస్యలా తోచింది. ఏ చీర కట్టుకుని అర్చన ముందుకి వెళ్ళాలన్నా భయం వేసింది.

చివరికి ఎలాగో తయారయి వెళ్తే ఆమె అనుకున్నంతా అయింది. అక్కడ అందరి మధ్యలో తను చాలా ఆడ్ గా వున్నానని ఆమెకి అర్థమయింది.

చీర పర్లేదు కానీ.. నగలు! అక్కడ ఎవరికీ మెడలు కనబడడం లేదు. తన మెడలో నాన్నాడు, ఒక వరుస నల్లపూసలు తప్ప మరేం లేవు.

జరీ ముద్దలా వున్న చీరతో.. తను సినిమాల్లో మాత్రమే చూసిన పెద్ద పెద్ద నగలతో అర్చన ఎదురు రాగానే భవానికి ఆనందం వేసింది. అన్ని నగలతో అర్చన సాక్షాత్తూ లక్ష్మీదేవిలాగే కనిపించింది.

భర్తతో కలిసి ఒకప్రక్కగా కూర్చున్న భవాని పెళ్ళి చూడలేదు. అర్చననే కన్నుల పండుగగా చూసింది.

మధ్యలో భోజనానికి తీసుకువెళ్ళేందుకు అర్చన రాగానే, యిక నిగ్రహించుకోలేనట్లు ఆమె చేయి గట్టిగా పట్టుకుని.. బుగ్గమీద ముద్దు పెట్టుకుంది.. "ఎంత బావున్నావే!" అంటూ.

అర్చన సంతోషంగా నవ్వింది .

"చీర చాలా బాగుంది." అంది భవాని.

"ఎందుకు బాగుండదూ! బోలెడు డబ్బు పోసి కొంటే!" అంది అర్చన , భవాని చేతుల్లోనుంచి బాబుని అందుకుంటూ.

ఒక్కసారిగా మైకం వదిలినట్లయింది భవానికి.

"డబ్బు" అన్నమాట వినపడగానే ఆమె మనసంతా చేదు తిన్నట్లుగా అయిపోయింది.

"దాని ప్రసక్తి ఎందుకిపుడు!" అనిపించింది ఒక్క క్షణం.

కానీ ఎక్కువ ఆలోచించకుండానే ఆమెకి అర్థమయింది. అర్చన బోలెడు డబ్బు పోసి కొంటే ఎందుకు బాగుండదూ! అనడంలో విచిత్రం ఏమీ లేదని ఆమెకి త్వరగానే తెలిసింది. ఆమాటల్లో దురుద్దేశ్యం కానీ.. తను భుజాలు తడుముకోవాల్సిన విషయం కానీ లేదు.

"అవును. డబ్బు గురించి మాట్లాడటానికి భయపడే స్థితిలో నేను వున్నాను. డబ్బు గురించి తప్ప మరేమీ మాట్లాడలేని పరిస్థితుల్లో అర్చన వుంది. కాలేజీరోజుల్లాగా కాదు. ఇప్పుడు తమ యిద్దరి పరిస్థితులూ వేరు." అనుకుంది భవాని నిట్టూరుస్తూ.

ఆలోచనలూ, భావాలూ కలిసిన వాళ్ళమధ్య మంచి స్నేహం ఏర్పడుతుందని ఆమె అప్పటివరకూ అనుకునేది. కానీ ఆలోచనలూ.. భావాలూ.. పరిస్థితులని బట్టి మారతాయని మాత్రం ఆమెకి అపుడే అర్థమవుతోంది. అంటే యిద్దరు వ్యక్తుల మధ్య స్నేహం నిలవాలంటే వాళ్ళిద్దరూ ఒకేరకం పరిస్థితులలో ఉండడం అవసరమా!

ఆలోచనలతో భవాని సరిగా భోజనం చేయలేకపోయింది.

భోజనాలవగానే ప్రకాశ్ బయల్దేరదామన్నాడు.

అర్చనతో ఆమాట చెప్పగానే.. "కాసేపు వుండవే! అసలు మనం మాట్లాడుకోనేలేదు." అంది.

భవాని అర్చనని జాలిగా చూసింది. తన సమక్షం ఏమాత్రం ఆనందం కలిగించక పోయినా .. ఆమెకి నచ్చే కబుర్లేవీ తను చెప్పలేకపోతున్నా .. తనని విడిచిపెట్టలేని తన స్నేహితురాలిని అభిమానంగా చూసింది. ప్రేమ పొంగిపొరలగా దగ్గరికి తీసుకుంది. ఇద్దరి కళ్ళలోనూ నీళ్ళు తిరిగాయి.

"ఇంటికెళ్ళి కాసేపు పడుకుంటాను అర్చనా! రేపు మళ్ళీ స్కూలుకి వెళ్ళాలి." అంది.

ఆమాటకి అర్చన అలిగింది. "రేపొక్కరోజూ స్కూలు మానేయచ్చుగా!" అంది నిష్టూరంగా.

భవాని నవ్వి వూరుకుంది.

వాళ్ళని గేటు వరకూ వచ్చి సాగనంపింది అర్చన.

బయటికి వచ్చాక "అర్చనా వాళ్ళు రెండు నెలలలో మళ్ళీ అమెరికా వెళ్తారట." అంది భవాని ప్రకాశ్ తో.

"మళ్ళీ ఏ రెండేళ్ళకో మూడేళ్ళకో చూస్తానేమో దాన్ని!" అనుకుంది దిగులుగా.

"పోనీ యిక్కడే వుంటావా! రాత్రంతా మీ ఫ్రెండ్ తో మాట్లాడుకోవచ్చు." అన్నాడు ప్రకాశ్ భవాని మొహంలోకి చూస్తూ.

"వద్దులెండి." అంది భవాని. "మాట్లాడుకునేదేం లేదు. ఊరికే దిగులు. అంతే."

అర్చన వూర్లో వున్న సమయంలో ఒక్క క్షణం కూడా వేస్ట్ చేయకూడదనుకున్న తను .. అర్చన రేపు మధ్యాహ్నం వూరికి వెళ్తుందని తెలిసీ .. యింకా యిరవైనాలుగు గంటలు వూర్లోనే వుంటుందని తెలిసీ.. ఆమెని వదిలిపెట్టి వెళ్ళిపోతోంది!

అలా అనుకోగానే భవాని మనసంతా ఏదోలా అయిపోయింది. అలాగని మళ్ళీ ప్రకాశ్ సూచించినట్లు వెనక్కి వెళ్ళాలనీ అనిపించలేదు. అన్యమనస్కంగా యిల్లు చేరారు. ఆలోచనలతో ఆ రాత్రి సరిగా నిద్ర పట్టలేదు.

మర్నాడు ప్రొద్దున నిద్ర లేచాక ఆమెకు ఆలోచించేంత వ్యవధి నివ్వలేదు పనులు. రోజూలాగే పరుగెత్తుతూ బస్ ఎక్కి ఆయాసం తీర్చుకుంటూ వుంటే.. లక్ష్మి పలకరింపుగా నవ్వింది. "వెళ్ళిందా మీ ఫ్రెండ్!" అంటూ.

"ఆ. వెళ్ళింది." రొప్పుతూ సమాధానం చెప్పింది భవాని. "ఈరోజు కూడా సెలవు పెట్టమని అడిగింది కానీ నేనే పెట్టలేదు." అంది కొంచెం బాధగా.

"ఎలా కుదుర్తుంది! శనివారం, సోమవారం రెండ్రోజులూ పెడ్తే ఆదివారం కూడా లాస్ ఆఫ్ పే అవుతుందిగా!" అంది లక్ష్మి.

తన యిబ్బందిని కరెక్ట్ గా అర్థం చేసుకున్నందుకు భవాని కృతజ్ఞతగా చూసింది లక్ష్మి వైపు.

ఆ తర్వాత యిద్దరూ చాలని సెలవుల గురించీ .. కోయబడే జీతాల గురించీ కబుర్లు చెప్పుకున్నారు.

ఇద్దరూ కలిసి బాధపడ్డారు. కలిసి వుక్రోష పడ్డారు. కదిలే బస్ లోకి చల్లటి గాలి వచ్చి సేద తీరుస్తుండగా.. ఆదివారం లాస్ ఆఫ్ పే అవడం ఎంత బాధగా వుంటుందో లక్ష్మితో చర్చిస్తుంటే భవానికి చాలా శాంతిగా అనిపించింది.

రెండ్రోజులు ఊపిరి ఆడకుండా చేసిన యిబ్బందేదో ఎగిరిపోయినట్లయింది. అర్చన పేరు తల్చుకోగానే వుప్పొంగుతున ఎగసిపడే అనురాగపు అల నిశ్శబ్దంగా వెనక్కి ముడుచుకుంది. మళ్ళీ రెండేళ్ళ దాకా అర్చన ఇండియాకి రాదన్న ఆలోచన గుండెలోతుల్లో తెలియని నిశ్చింతని కలిగించింది.

*****